క్లుప్తంగా

సంపూర్ణ మిశ్రమ దాణా ప్రాముఖ్యం వివరించాలి

టంగుటూరు: పాడి రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణా ప్రాముఖ్యత వివరించాలని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి ఆదేశించారు. మండలంలోని సూరారెడ్డిపాలెం పశువైద్యశాలను ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువైద్యశాల, అందులో ఉన్న పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పశుపోషకులు జగనన్న పాల వెల్లువలో భాగంగా అమూల్ పాల కేంద్రంలో పాలు పోసి గిట్టుబాటు ధర పొందాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై దాణా అందిస్తోందని చెప్పారు. డాక్టర్ జి.విజయ మాధవి, అసిస్టెంట్ వెటర్నరీ అంకమ్మ, ఆఫీస్ అసిస్టెంట్ మనోహర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

టంగుటూరు: ఉపాధి హామీ పనుల్లో రోజువారీ కూలీల సంఖ్యను పెంచాలని టీఏ, ఎఫ్ఏలను డ్వామా పీడీ శీనారెడ్డి ఆదేశించారు. టంగుటూరు పంచాయతీలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా శీనారెడ్డి మాట్లాడుతూ సోమవారం నుంచి కూలీలను సమీకరించాలన్నారు. ఏపీఓ సుభాషిణీ, ఈసీ రవికుమార్, టీఏ బాబు, ఎఫ్ఏ మనోహర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల దరి చేర్చాలి

కనిగిరి రూరల్: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వలంటీర్లు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల దరిచేర్చాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీనియర్ అసిస్టెంట్ రహమత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అర్జీలపై విచారణ

ఉలవపాడు: మండల పరిధిలో అసైన్‌మెంట్ కమిటీ సిఫార్సు కోసం దరఖాస్తు చేసిన అర్జీలను తహశీల్దార్ మహ్మద్ హుసేన్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వం ఇటీవల అసైన్‌మెంట్ కమిటీ ద్వారా దీర్ఘకాలిక సాగులో ఉన్న భూములకు పట్టాలు అందించే కార్యక్రమానికి సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. అందులో భాగంగా చాగల్లు, భీమవరం గ్రామాల్లో వచ్చిన అర్జీలు వాటికి సంబంధించిన భూములను పరిశీలించారు. నివేదికను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో శ్రీనివాసులు, బాలచందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

హనుమంతునిపాడు: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కార్యదర్శులు చూడాలని ఎంపీడీఓ జీవి.కృష్ణారావు అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శనివారం ఎంపీడీఓ కార్యలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు సక్రమంగా అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అర్హులకు అందేలా చూడాలని సూచించారు. అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. వీఓఆర్డీ షేక్ షరీఫ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కవర్ల తయారీని పరిశీలించిన కమిషనర్

కందుకూరు అర్బన్: టంగుటూరు మండలం కొణిజేడు మండలంలో భూమిలో లిసి పోయే కవర్ల తయారు చేసే కంపెనీ కర్మాగారాన్ని కమిషనర్ ఎస్. మనోహర్ శనివారం సందర్శించారు. కవర్ల తయారీ విధానం, నాణ్యతను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఉన్న అనుమతులు, ఎక్కడెక్కడ సరఫరా చేస్తున్నారు, వాడుతున్న ముడి సరుకులు గురించి అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని వ్యాపారులంతా ఇలాంటి కవర్లను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని కమిషనర్ సూచించారు

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



వెలిగండ్లలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా సమన్యాయం జరిగిందని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండల సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. వెలిగండ్లలో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు మండల నాయకులను ఘనంగా సన్మానించారు. ప్రతి గడప గడపను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ గ్రామ సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కార మార్గాలను అన్వేషించడం ఈ కార్యక్రమం ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా ఎంతో రుణపడి ఉన్నామన్నారు. పేద మధ్యతరగతి సంక్షేమం కోసం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఎటువంటి వివక్షత లేకుండా, అవినీతి రహితంగా అందజేస్తున్న ఏకైక ప్రభుత్వమన్నారు. జగనన్న పదికాలాల పాటు సీఎంగా కొనసాగే విధంగా ప్రజలు దీవించాలన్నారు. అవినీతికి తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి, ఎంపీడీఓ టి.సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు టి.మేరిపుష్ప, ఆరెకటికె కార్పొరేషన్ చైర్మన్ దాదా కుమారిలక్ష్మి, ముదిరాజ్ కార్పొరేషన్ కార్యదర్శి కుప్పనబోయిన పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ టి.సురేష్‌బాబు, మాజీ సర్పంచ్ సోము చౌడారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ హబీద్, పొల్లా సుబ్రహ్మణ్యం, నాయకులు వై నాగూర్‌యాదవ్, టి.దేవసహాయం, టి.నాని, మేడం ఆదిరెడ్డి, యెలికె రమణయ్య, యెలికె నారాయణ, ఆకుల రాజ్‌కుమార్, గోనా జేమ్సు, చెన్నకేశవులు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

అర్హతే గీటు రాయిగా జగనన్న పథకాలు



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

వలేటివారిపాలెం: అర్హతే గీటు రాయిగా జగనన్న పథకాలు అందుతున్నాయని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోకూరు సచివాలయం పరిధిలో కొమ్మరపాలెం, పోకూరు గ్రామాల్లో శనివారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించి బుక్‌లెట్లు అందజేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందాయా లేదా ఇంకేమైనా పథకాలకు అర్హత ఉండి దరఖాస్తు చేసుకోవాలా అని అడిగి తెలుసుకున్నారు. పోకూరు ఎస్సీ కాలనీకి చెందిన యండ్లూరి జక్కరయ్య ఉపాధి హామీ పనులకు 15 రోజులకు బిల్లులు చెల్లించలేదని చెప్పగా..స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిచి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. కళావతి అనే దివ్యాంగురాలు ట్రై సైకిల్ ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరింది. రెండు సార్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చిందని, మూడోసారి రాలేదని చెప్పడంతో నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. కాలనీవాసులు మురుగుకాల్వలు కావాలని, విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను 10 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 500 ఇళ్లకు ఎమ్మెల్యే తిరిగారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్, తహసీల్దార్ సుందరమ్మ, ఏపీఓ షమీర్‌బాషా, ఏపీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయబ్ రసూల్, ఏఓ హేమంత్ భరత్‌కుమార్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ మధుబాబు, ఎస్సై సుదర్శన్ యాదవ్, జెడ్పీటీసీ భారతి, ఎంపీపీ మౌనిక, ఎంపీటీసీలు రవీంద్ర, విజయలక్ష్మి, వైస్ సర్పంచ్ శరత్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రామయ్య, వడ్లమూడి సుబ్బారావు, ఇంటూరి హరిబాబు, జగదీష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తి

- వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- నర్సరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



యువతికి పథకాలు వివరిస్తున్న ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

మర్రిపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని తంగెళ్ల సచివాలయ పరిధిలోని నర్సరాజుపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి అశోక్‌బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ బ్రోచర్‌లు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు ఏయే పథకాలు అందాయో ప్రతి కుటుంబాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గ్రావెల్ రోడ్‌లు, సైడ్ డ్రైన్స్, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలంటూ గ్రామస్తులు వరికూటి అశోక్ బాబును కోరారు. అనంతరం వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీన పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు సేవలను ప్రశంసించారు. వాహనాల ద్వారా రేషన్ కార్డుదారుల ఇళ్లకే వెళ్లి చౌక బియ్యం అందిస్తున్నారని గుర్తు చేశారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నారని, ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతోందన్నారు. అన్నీ వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిరిగి ఆశీర్వదించాలని వరికూటి అశోక్‌బాబు కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు భోగసముద్రం విజయ భాస్కర్‌రెడ్డి, దొద్దాలి మల్లికార్జున, వనిపెంట మల్లికార్జునరెడ్డి, అలికేపల్లి వెంకటరెడ్డి, చేకూరి శ్రీనివాసరావు, పాలెపు బ్రహ్మయ్య, దొద్దాల నర్సింగ్‌రావు, తాళ్లూరి కళంధర్‌రావు, కొత్తపల్లి రామకోటయ్య, గొబ్బూరి చెన్నంరాజు, వాకా బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

25 నుంచి ఆలయ తృతీయ వార్షిక వేడుకలు

సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో ఈ నెల 25 నుంచి పట్టాభి రామచంద్ర స్వామి తృతీయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా 25న గణపతి పూజ, పుణ్యాహ వాచనం, మాతృకా పూజ, రక్షాబంధనం, కలశస్థాపన, సాయంత్ర సహస్రనామ కుంకుమార్చనలు, దీక్షా హోమాలు, 26న గోపూజ, పట్టాభి రామచంద్ర స్వామి మూల మంత్ర జపాలు, చడీ పారాయణాలు, సుందరకాండ పారాయణాలు, సీతా రాముల శాంతి కల్యాణం సీతా సమేత పట్టాభిరామచంద్ర స్వామి గ్రామోత్సవం, 27న వసంతోత్సవం, పొంగళ్లు, వనభోజనాలు నిర్వహిస్తామన్నారు. 28న ఎడ్ల బండలాగుడుపోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

అమ్మవార్లకు వెండి కిరీటాలు బహూకరణ

కందుకూరు అర్బన్: పట్టణంలోని జనార్దనస్వామి ఆలయంలోని అమ్మవార్లకు సుమారు రూ.60వేలు విలువైన వెండి కిరీటాలను బహూకరించినట్లు ఈఓ బైరాగి చౌదరి తెలిపారు.

జూదరుల అరెస్టు

పెద్దకల్లగుంట (మర్రిపూడి): కొండపి మండలం పెద్ద కల్లగుంట శివారు పొలాల్లో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. దాడుల్లో ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద మూడు పందెం కోళ్లు, రూ.12,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



చిన్నారి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ

గుడ్లూరు: మండలంలోని చెమిడిదిపాడులో రెండు, పోట్లూరులో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ఉలవపాడు ప్రాజెక్టు సీడీపీఓ విజయకుమారి శనివారం తనిఖీ చేశారు. నాలుగు కేంద్రాల్లో రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ప్రీస్కూల్ చిన్నారులతో మాట్లాడుతూ వారికి చెప్పిన పాఠాలను అడిగి వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో కూడిన ఇంగ్లిష్‌లో విద్యా బోధన చేయాలని కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక విలువలు ఉన్న ఆహారం అందిస్తారని గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించి వారు కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం పెడుతూ ప్రతి రోజు వారి బరువులు, ఎత్తులు చూడాలన్నారు. సీడీపీఓ వెంట తెట్టు సెక్టార్ సూపర్‌వైజర్ కామేశ్వరీ ఉన్నారు.

రేపు ఏఎంసీ చైర్‌పర్సన్ శారద ప్రమాణస్వీకారం

టంగుటూరు: కొండపి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా గోగినేని శారద స్థానిక సీవీఆర్ కల్యాణ పండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఏఎంసీ కార్యదర్శి వి.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



చేవూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సూర్యచంద్రరావు

గుడ్లూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనింగ్ అధికారి సీహెచ్ సూర్యచంద్రరావు అన్నారు. మండలంలోని మోచర్ల, ఏలూరుపాడు, చేవూరు గ్రామాల్లో జగనన్న కాలనీలలో మొదటి విడత గృహ నిర్మాణాలను సూర్యచంద్రరావు శనివారం పరిశీలించారు. గృహాల పనులు ఎంత వరకు పూర్తయ్యాయే లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గృహాల నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్, నగదు ప్రభుత్వం అందచేస్తున్నందున నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. మూడు గ్రామాల్లో 155 గృహాలకు నిర్మాణ పనులు మొదలు పెట్టి వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 100 గృహాలకు స్లాబ్‌లు, 40 గృహాలు రూఫ్ లెవల్ వరకు పూర్తయ్యాయని, 15 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది నాటికి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవకుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎస్సై

వెలిగండ్ల: ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ని ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పి.మహేష్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి, నాయకులు వై నాగూర్‌యాదవ్, టి. దేవసహాయం, చెన్నకేశవులు ఉన్నారు.

పీఎం శ్రీ పథకానికి ఎంపిక

గుడ్లూరు: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకానికి స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎంపిక అయినట్లు పాఠశాల పూర్వపు ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సులోచన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ వ్యాప్తంగా 14,500 పాఠశాలలను కేంద్ర నిధులుతో అభివృద్ధి చేసి వాటికి పూర్తి స్థాయిలో జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పి పాఠశాలల పూర్తి వివరాలు తెలియచేయాలని తెలిపారన్నారు. దీంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సమాచారం వివరాలను పంపగా.. పీఎం శ్రీ స్కీం కింద తమ పాఠశాల ఎంపికైయినట్లు జాయింట్ కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం సమాచారం వచ్చినట్లు తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.8,76,980

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.8,76,980 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.21,880, తలనీలాలు రూ.25,925, ప్రత్యేక దర్శనం రూ.1,31,400, లడ్డుప్రసాదాలు రూ.1,48,285, అన్నదానం రూ.5,06,404, రూమ్‌అద్దెలు రూ.19,330 వచ్చినట్లు తెలిపారు.

హెల్మెట్ రక్షణ కవచం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న వరికూటి, సీఐ రంగనాథ్

టంగుటూరు: ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం లేకుండా హెల్మెట్ ఒక రక్షణ కవచంలా పని చేస్తుందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద శనివారం సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐ రంగనాథ్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించినప్పుడే ప్రమాలు నివారించవచ్చునన్నారు. ఎస్‌ఐలు ఖాదర్‌బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొన్నలూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని కొండపి సీఐ మాతంగి శ్రీనివాసులు అన్నారు. పొన్నలూరులో శనివారం హెల్మెట్‌పై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ డి.రాజారావు పాల్గొన్నారు.

కొండపి: ద్విచక్ర వాహనదారులు ప్రయాణం సమయంలో రక్షణ కోసం హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వాహనాదారులకు రహదారి భద్రతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఘనంగా రామ్మూర్తి జయంతి

మర్రిపూడి: విశ్వబ్రహ్మణ జాతిపిత గానాల రామ్మూర్తి జయంతిని మండల కేంద్రం మర్రిపూడి విశ్వబ్రహ్మణుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీచక్ర ఉపాసకులు, శ్రీశైలం స్వామిజీ మాట్లాడుతూ విశ్వబ్రహ్మణుల స్థితిగతులను సర్వే చేసి పోరాటంతో వారిని బీసీల్లో చేర్పేందుకు రామ్మూర్తి కీలకపాత్ర పోషించారన్నారు. విశ్వబ్రహ్మణుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదుమూడి రవిప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వబ్రహ్మణులపై ఉన్న అభిమానంతో రెండోసారి రాష్ట్ర విశ్వబ్రహ్మణుల కార్పొరేషన్ అండ్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా తోలేటి శ్రీకాంత్‌ను, కార్పొరేషన్ డైరెక్టర్‌గా గోనుగుంట్ల రజిని బ్రహ్మేంద్రకుమార్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈదుమూడి ప్రసాద్, సతీష్, జి. శ్రీనివాసరావు, లింగాల సాయి, సి.బాలబ్రహ్మం, గురుబ్రహ్మం ఏడుకొండులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదులో జాగ్రత్తలు పాటించాలి

సీఎస్‌పురం: ఈ క్రాప్ నమోదులో ఆర్‌బీకే సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి కంచెం రాధ అన్నారు. మండలంలోని పెదగోగులపల్లి, ఆర్‌కేపల్లి ఆర్‌బీకేల పరిధిలో ఈ క్రాపు నమోదును శనివారం పరిశీలించారు. పంటలు సాగు చేసిన రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. వివరాలు నమోదులో తప్పులు జరిగితే అసలైన రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని, ఈ క్రాపు నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఏఈఓ షబానా, వీహెచ్‌ఏ ఎం వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు వెంటనే చేపట్టాలని ఎంపీడీఓ రత్నజ్యోతి పేర్కొన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శనివారం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి పనులపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వచ్చే మార్చి చివరి నాటికి ప్రతి ఉపాధి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామాభివృద్ధికి దోహదపడే పనులు చేయించాలన్నారు. ప్రభుత్వం ఆదేశించిన లక్ష్యాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీఓ మాచర్ల, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

25న మండల సమావేశం

సీఎస్‌పురం: మండల సమావేశం ఈ నెల 25న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

పీసీపల్లి: ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రాప్రగతి గ్రామీణబ్యాంకు మేనేజర్ టి.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల విద్యార్థులకు ఏపీజీబి ఆధ్వర్యంలో కళాజాత బృందంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు లావాదేవీలు చేసే విధానం, సైబర్‌క్రైం, నేరాలు, పొదుపు ఖాతాలు, అటల్ పెన్షన్‌యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పంటరుణాలు, పొదుపుసంఘాలకు చేయూత వంటి లావాదేవీలు, అంశాలపై విద్యార్థులకు వివరించారు.

వివాహిత ఆత్మహత్య

పామూరు: మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన స్థానిక దేవాలయం వీధిలో శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..దేవస్థానం వీధిలో ఉన్న అగ్నిగుండాల ఖాజాబి(25)కి వివాహం కాగా ఏడేళ్ల కుమార్తె ఉంది. కొంతకాలంగా ఈమె భర్త రమేష్ దూరంగా కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమీపంలోని వారు గమనించి ప్రభుత్వ వైద్యశాలకు ఆటోలో తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలి తండ్రి మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌యాదవ్ పేర్కొన్నారు.